## క్లుప్తంగా

### టీబీపై అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మి వాడలో వెంకట్రావ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సతీష్‌కుమార్, శరత్ బాబు, సురేశ్, శోభ, సిబ్బంది రజిత, స్రవంతి, గఫూర్, ఇసాక్ అహ్మద్, విజయ, సుజాత, ఆంజనేయులు, శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

### విద్యుత్ అధికారుల 'పొలంబాట'



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని కొమ్మెర గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం 'పొలంబాట' కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ వినియోగం, కెపాసిటర్ల వల్ల లాభాలు, విద్యుత్ సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కౌట్టి శ్రీనివాస్, లైన్‌మెన్లు, రైతులు పాల్గొన్నారు.

### శివుడికి ప్రత్యేక పూజలు



లక్ష్మీహోమం నిర్వహిస్తున్న భక్తులు

**మంచిర్యాలఅర్బన్:** స్థానిక రాళ్లపేట్ రోడ్ నంబర్-1లో శివపంచాయితన ఆలయంలో మంగళవారం సంకష్టహర చతుర్థి సందర్భంగా లక్ష్మీహోమం నిర్వహించారు. శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో మంగళవారం అంగారక సంకష్ట హర చతుర్థి సందర్భంగా (మధుమిశ్రిత పంచకాజ్యం-తేనెతో కలిపిన పతుకులతో) స్వామికి అభిషేకం నిర్వహించినట్లు ఆలయ ఈవో ముక్తా రవి తెలిపారు.

### ఫ్రెషర్స్ డే హంగామా..!




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

**జన్నారం:** మండల కేంద్రంలోని పైడిపెల్లి గార్డెన్‌లో రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, డీన్ హేమలత షిండే, లిటిల్‌హార్స్ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కస్తూర్బాలో వైద్య శిబిరం

**జైపూర్:** మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలర్జీ వ్యాధుల బారిన పడటంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చర్మ సంబంధిత వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో చర్మ వైద్య నిపుణురాలు డాక్టర్ విద్య, ముస్తాఫా, తహసీల్దార్ వనజారెడ్డి, వైద్యులు అశోక్, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిబాల తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

**కాసిపేట:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. మండలంలోని లంబాడితండా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు పరిశీలించి, విద్యార్థులకు ప్రభుత్వం అందించే నోటుబుక్కులు, పుస్తకాలు, యూనిఫాంలు అందరికీ అందాయా లేదా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్థాయిని పరిశీలించారు.

# ఖాళీ స్థలాల్లో ముళ్ల కంపలు

- చిట్టడవిని తలపిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ పాతబస్టాండ్ సమీపంలో ముళ్ల పొదలు

**చెన్నూర్:** మున్సిపాలిటీ పరిధిలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు విపరీతంగా పెరిగి చిట్టడివిని తలపిస్తున్నాయి. మున్సిపాలిటీలో సుమారు 650కి పైగా ఖాళీ స్థలాలు ఉండగా, స్థల యజమానులు ఇళ్లను నిర్మించుకోకుండా వృథాగా వదిలేశారు. దీంతో అవి క్రిమీకీటకాలు, విష సర్పాలకు ఆవాసాలుగా మారుతుండగా, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఎక్కడెక్కడ..**

పట్టణంలోని పాత బస్టాండ్, ఇందిరానగర్, గెర్రె కాలనీ, ఆదర్శనగర్, ఎమ్మెల్యేకాలనీ, జెండవాడ, బ్రాహ్మణ వాడ, కొత్తగూడెం కాలనీ, బట్టిగూడెం, బ్రాహ్మణవాడ, మహాకాంళివాడ, బేతాళవాడ, అంబేడ్కర్‌కాలనీ, శ్రీనగర్ కాలనీ, లైన్‌గడ్డ, కుమ్మరిబొగుడలతో పాటు మరికొన్ని కాలనీల్లో వృథా స్థలాలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

### తొలగించాలి..



ప్రధాన రోడ్లు తప్పా బైపాస్ రోడ్డు, ఎమ్మెల్యే కాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగాయి. పాములు, తేళ్లు తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో అని భయం వేస్తుంది. పిచ్చి మొక్కలు బాగా పెరిగి రోడ్డుకు అడ్డుగా వచ్చినా పట్టించుకున్న నాథుడే లేరు. వాన కాలం కావడంతో ముళ్ల పొదలతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – శంకర్, అంబేడ్కర్ కాలనీ

## పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలి



పరిసరాలు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

**జైపూర్:** పల్లెల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని, రోడ్లపై చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు సూచించారు.మండలంలోని కాన్కూర్ గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వాడవాడలా తిరుగుతూ పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. పలు వీధుల్లో రోడ్లపై, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు, అపరిశుభ్రంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సూచనలు ఇచ్చారు. కంపోస్టు ఎరువు తయారీ, పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటికలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఓటర్ల లిస్టు మెర్జింగ్ ప్రక్రియను పరిశీలించి, తప్పులు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పీఏఐ డేటాను పంచాయతీ కార్యదర్శుల సంతకాలతో సేకరించాలన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, ఇందారం పంచాయతీ కార్యదర్శి సుమన్, కాన్కూర్ పంచాయతీ కార్యదర్శి సురేందర్ ఉన్నారు.

## పర్యావరణంపై ఉపాధ్యాయులకు శిక్షణ



ముల్కల్ల గురుకుల విద్యాలయంలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో కాళేశ్వరం జోన్ జోనల్ అధికారి అరుణకుమారి ఆదేశాల మేరకు మంగళవారం కాళేశ్వరం జోన్ పరిధిలోని 26పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరిసరాలు, ప్రకృతితో పాటు పర్యావరణంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వృక్ష, జంతు జాతులను కాపాడుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్-మిషన్ ప్రకృతికి సంబంధించిన వన్ డే ఓరియెంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా మెంటార్, టీచర్లుగా వ్యవహరిస్తున్న సీనియర్ ఎడ్యుకేటర్ అక్బర్, కో ఆర్డినేటర్ ఎం.ఎస్.టీ.రావు, రిలేషన్‌షిప్ పార్టనర్ శ్రీనివాస్‌లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. డబ్ల్యూడబ్ల్యూఎఫ్ మిషన్ ప్రకృతి ఇన్‌చార్జులు కిరణ్ టీజీటీ బయోసైన్స్‌లో, సంధ్య మ్యాథమెటిక్స్‌లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ కే.మహేశ్వర్‌రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ కే.రమేశ్, కాళేశ్వరం జోన్ పరిధిలోని 26పాఠశాలలకు చెందిన 52మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల తనిఖీ

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపుతున్న పలు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొన్నారు. ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్నట్లు నిర్ధారించి బీఎన్‌ఎస్ 281సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నోటీసులు ఇచ్చారు. అనంతరం ఎస్సై స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

### 'విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం'





మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి తిరుపతి

**బెల్లంపల్లి:** విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని భారత ఐక్యవిద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట మంగళవారం విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవి కుమార్, అజయ్, సందీప్, రమేష్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు ప్రారంభం



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

**శ్రీరాంపూర్:** కంపెనీ అభివృద్ధి కోసం ఉత్పాదకతను మరింత పెంచాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ఆర్కే 7 గనిపై మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాలు ప్రారంభం కాగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ప్రతీ సంవత్సరం గని వార్షిక లక్ష్యాలను సాధిస్తుందని, మున్ముందు కూడా దీన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మల్టీ డిపార్మెంటల్ కమిటీ కన్వీనర్ ఏరియా ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఏజీఎం బీభత్సా, డీజీఎంలు రాజన్న, రామకృష్ణారావు, ఏరియా రక్షణాధికారి విజయకుమార్, గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి సంతోష్, సంక్షేమ అధికారి శంతన్, ఏఐటీయూసీ నాయకులు వీరభద్రయ్య, కొట్టే కిషన్ రావు ఫిట్ సెక్రటరీ సారయ్య పాల్గొన్నారు.

**జీఎం కార్యాలయంలో...**

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం, ఎస్అండ్‌పీసీ, వీటీసీ, డిస్పెన్సరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో జీఎం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ ఏవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బొగ్గుబాయి వార్తలు

**'గని ప్రమాదంపై విచారణ జరగాలి'**

**రామకృష్ణాపూర్:** ఇటీవల మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో జరిగిన ప్రమాదానికి సంబంధించి గని సర్దార్, ఓవర్‌మెన్‌లకు చార్జ్‌షీట్ ఇచ్చి సస్పెండ్ చేయడం అన్యాయమని, ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని ఏఐటీయూసీ అనుబంధ మైనింగ్ స్టాఫ్ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే ఓసీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కాలపరిమితి ముగిసిన ఎస్‌డీఎల్ యంత్రం వాడడం, డీజీఎంఎస్ నియమాలను అతిక్రమించడం వల్లే ప్రమాదం జరిగిందని, ఈ ప్రమాదానికి అధికారులే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సతేంద్ర సత్యనారాయణ, గోపతి సత్యనారాయణ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

**లాభాలు ప్రకటించాలని వినతి**

**శ్రీరాంపూర్:** కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్కే 5, ఎస్ఆర్పీ 3 గనులపై గని మేనేజర్లకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమాల్లో ఫిట్ సెక్రెటరీలు, నాయకులు పాల్గొన్నారు.

**'ఎన్నికల హామీలు అమలు చేయాలి'**

**శ్రీరాంపూర్:** గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన సంఘాలు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామెర గట్టయ్య డిమాండ్ చేశారు. ఆ యూనియన్ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో మాట్లాడారు.కార్యక్రమంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి రాజయ్య ఉన్నారు.

## గనులపై కేఎల్ మహేంద్ర వర్ధంతి



కాసిపేట గనిపై నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

**బెల్లంపల్లి/కాసిపేట:** మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై, మందమర్రి ఏరియా కాసిపేట 1, 2 గనులపై మంగళవారం అమరుడు, ఏఐటీయూసీ అగ్రనేత కేఎల్ మహేంద్ర వర్ధంతిని నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు, కార్మికులు విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ శాంతిఖని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్, వర్క్ మైన్ ఇన్‌స్పెక్టర్లు రాజలింగు ,ఎం.రమేశ్, అశోక్, రాంచందర్, దాడి రమేష్, భాస్కర్, శ్రీకాంత్, గణేశ్, రాజేష్, కాసిపేట 2గనిపై ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నర్సయ్య, బొద్దుల వెంకటేష్, కొత్తపల్లి కృష్ణచారి, కాసిపేట గనిపై బ్రాంచి కోశాధికారి నాగేశ్వరరావు, ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మినారాయణ, పార్వతి సురేష్, చొప్పరి శ్రీహరి, కొక్కెర సంతోష్ మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నిషేధం ఎత్తివేయడంపై హర్షం



దీక్షాపరులను సన్మానిస్తున్న నాయకులు

**జన్నారం:** జన్నారం మండలం మీదుగా భారీ వాహనాల రాకపోకల నిషేధం ఎత్తివేయడంపై మంగళవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషి ఫలితంగానే ఈ నిషేధం ఎత్తివేసారని నాయకులు ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**దీక్షాపరులకు సన్మానం..**

సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్‌లు చేసిన రిలే నిరహార దీక్షల ఫలితంగా నిషేధం ఎత్తివేశారని హర్షం వ్యక్తం చేస్తూ అఖిల పక్ష నాయకులు వారిద్దరిని సన్మానించారు. కార్యక్రమంలో చింతగూడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ విజయధర్మా, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- ఆశ్రమ పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ కుమార్‌దీపక్

**జన్నారం:** ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. మండలంలోని జన్నారం, కవ్వాల్ ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆహారం మెనూ ప్రకారం ఇస్తున్నారా.. ఈ రోజు ఏ ఆహారం పెట్టారని అడిగి తెలుసుకున్నారు. గోడ కూలిందని హెచ్‌ఎం శివరాజం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి 30మీటర్ల ప్రహరీ నిర్మించాలని ఎంపీవో జలెందర్‌ను ఆదేశించారు. రూ.16లక్షలతో టాయిలెట్లు బాగు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జ్వరం, జలుబు లాంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తిస్తే వెంటనే ఆసుపత్రుల్లో చూపించాలని సూచించారు. కవ్వాల్ బాలికల ఆశ్రమ పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి వెంటనే పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడాలని ఇరు పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డీటీ రామ్మోహన్, ఎంఈవో విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పెండింగ్ భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

**కోటపల్లి:** మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు త్వరగా పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆదేశించారు. కోటపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులతో, కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడారు. భూ భారతి గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రతి దరఖాస్తుకు ఫైల్స్ సిద్ధంగా ఉంచేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ప్రతీ దరఖాస్తు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేయాలని, ఈ కేవైసీ అనంతరం ప్రాసెస్ చేయాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన వారి సమస్యలను అడిగి త్వరగా పరిష్కారం చూపాలని తహసీల్దార్ రాఘవేందర్ రావును ఆదేశించారు. అనంతరం సర్వాయిపేటలోని ఫెర్టిలైజర్ షాపును తనిఖీ చేసి స్టాక్ నిలవలను పరిశీలించారు. యూరియా నిల్వలు, అమ్మకాలను పరిశీలించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోతీరాం, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

**రామకృష్ణాపూర్/బెల్లంపల్లి/చెన్నూర్/తాండూర్/జైపూర్/భీమారం:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జైపూర్ మండలం ఇందారం క్రాస్ రోడ్డులో, తాండూర్, భీమారంలో జాతీయ రహదారిపై, బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఏరియా, కాల్‌టెక్స్ టీ జంక్షన్ ప్రాంతంలో మంగళవారం వాహనాలను వేర్వేరుగా తనిఖీ చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. తాండూర్‌లో సీఐ ఎస్.దేవయ్య, జైపూర్‌లో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, చెన్నూర్‌లో ఎస్సై శ్యాంపటేల్, భీమారంలో ఎస్సై శ్వేత, బెల్లంపల్లిలో టూటౌన్ ఎస్సై సి.హెచ్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలు పాటించాలని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని, ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని పలు సూచనలు చేశారు. అనుమానితులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారిని క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని వదిలిపెట్టారు. తాండూర్ సర్కిల్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న బ్లాక్ స్పాట్‌లను సీఐ దేవయ్య, ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో జైపూర్ ఎస్సై శ్రీధర్, తాండూర్‌లో ఏఎస్సై, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు. రామకృష్ణాపూర్ టోల్‌ప్లాజా సమీపంలో మందమర్రి సర్కిల్ పరిధిలోని డ్రైవర్లకు ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. చెన్నూర్‌లో పెద్ద చెరువు రావిచెట్టు, ఆస్నాద్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలతో పాటు లాడ్జిలు, వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, అదనపు ఎస్సై నూనె శ్రీనివాస్, ఆర్‌కేపీ ఎస్సై రాజశేఖర్, కాసిపేట ఎస్సై ఆంజనేయులు, దేవాపూర్ ఎస్సై గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**కోటపల్లి:** రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా అనుమానితులను విచారణ జరిపి వదిలిపెట్టారు. గ్రామంలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా తెలంగాణలోకి ప్రవేశించే ప్రతీ ఒక్కరిపై నిఘా ఉందన్నారు. ఆగస్టు 15వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ బన్సిలాల్, ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

**మంచిర్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అనుమానితుల వివరాలు సేకరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సీఐ ప్రమోద్‌రావు, ఎస్సైలు, ప్రత్యేక పోలీస్ టీమ్ పాల్గొన్నారు.

### సంక్షిప్త వార్తలు

**హెచ్‌ఐవీని అరికట్టడంలో యువత కీలకం**

**మంచిర్యాలటౌన్:** హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి, బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మంగళవారం హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఎన్‌హెచ్‌ఎం డీపీవో ప్రశాంతి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వోలు నాందేవ్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, ఐసీటీసీ కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, నర్మద పాల్గొన్నారు.

**పంచాయతీ కార్యదర్శికి అండ**

**జైపూర్:** మండలంలోని టేకుమట్ల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న శ్రావణి గత నెల 25న రోడ్డు ప్రమాదంలో గాయపడగా పే బ్యాక్ సొసైటీ సభ్యులు ఆమెకు అండగా నిలిచారు. తమ వంతు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, పే బ్యాక్ సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు దాసరి వెంకటరమణ, జాడి రాంకుమార్ శ్రావణి చికిత్స కోసం మద్దతుగా నిలిచిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దాసరి నరేందర్, పంచాయతీ కార్యదర్శులు సుమన్, సాయి లు ఉన్నారు.

**హిందూ ఉత్సవ సమితి నాయకుల అరెస్టు**

**మంచిర్యాలక్రైం:** హిందూ ఉత్సవ సమితి నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. భాగ్యనగరం బంజారాహిల్స్‌లో పెద్దమ్మ గుడి అక్రమ కూల్చివేతకు నిరసనగా గుడి వద్ద మంగళవారం కుంకుమార్చన చేయాలనే రాష్ట్ర హిందూ సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్‌కు వెళ్తున్న హిందూ ఉత్సవ సమితి నగర కార్యదర్శి కర్ణకంటి రవీందర్, రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ కొట్టె నటేశ్వర్, అడ్వకేట్ రామగిరి శ్రీనివాస్‌లను జిల్లా కేంద్రంలో పోలీసులు అరెస్టు చేశారు.

**పీఆర్‌పీ జాప్యాన్ని నిరసిస్తూ అధికారుల నిరసన**

**రామకృష్ణాపూర్:** సింగరేణి అధికారుల వేతనాల్లో భాగమైన పీఆర్‌పీ(పర్ఫామెన్స్ రిలేటెడ్ పే) చెల్లింపులో అసాధారణ జాప్యాన్ని నిరసిస్తూ మంగళవారం మందమర్రిలో అధికారుల సంఘం పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లపై నిరసనలు తెలియజేశారు. 2022 నుండి ఇప్పటివరకు పీఆర్‌పీ చెల్లించడం లేదని పేర్కొన్నారు.

**హర్‌ఘర్ తిరంగ కార్యశాల ఏర్పాటు**

**చెన్నూర్:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో హర్‌ఘర్ తిరంగ కార్యశాలను ఏర్పాటు చేసినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్ అన్నారు. ఆగస్టు 15న ప్రతీ ఇంటిపై జాతీయ పతకాలు ఎగురవేయాలని తెలిపారు.